సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 8 । జూన్ । 2023



గృహ నిర్మాణాలు వేగవంతం
గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబు ఆదేశించారు. 8లో



సీహెచ్‌సీకి జనరేటర్లు 8లో
వై.రామవరం సీహెచ్‌సీకి పూర్తిస్థాయిలో జనరేటర్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని సూపరింటెండెంట్ గౌతమి తెలిపారు.



చిరుధాన్యాల సాగు విస్తరణ
చిరుధాన్యాల సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీసీఎన్ఎఫ్ రాష్ట్ర రిసోర్సు పర్సన్ దేముళ్లు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

నాడు-నేడు పనులు వేగవంతం
● ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



సూచనలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలో వివిధ పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనులను వేగవంతం చేయడంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు తగిన కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు అధ్యక్షతన నాడు–నేడు పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. నాడు–నేడు జేఈ వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

డ్యాన్స్ షో విజేతకు సత్కారం



సిద్ధూని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఎటపాక: బుల్లి తెర డ్యాన్స్ షో విజేతను ఘనంగా సత్కరించారు. మండలంలోని గౌమ్ముకోయగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి సిద్ధూ ఓ టీవీ డ్యాన్స్ షోలో ఉత్తమ ప్రతిభ కనబరిచి టైటిల్ సాధించాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి వచ్చిన సిద్ధూను బుధవారం వైఎస్సార్ సీపీకి చెందిన మోసం కన్నా ఆధ్వర్యంలో తోటపల్లిలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ టీవీ డ్యాన్స్ షోలో విజేతగా నిలవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. సాటి యువతకు ఆదర్శంగా నిలిచాడని వారు పేర్కొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

పెదబయలు: గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. బుధవారం సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు జంక్షన్‌లో వాహన తనిఖీల్లో భాగంగా కారును తనిఖీ చేయడంతో 9 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఏలూరు మండలం శ్రీనివాసరావుపేటకు చెందిన కొల్లూరి తేజ ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నాలబత్తుల విజయ్‌కుమార్ ముంచంగిపుట్టు మండలం మారుమూల ప్రాంతంలో కొనుగోలు చేసిన గంజాయిని పాడేరు వైపు కారులో తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి గంజాయి, కారును స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో విస్తృత తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లగేజీ బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి,పాడేరు: గంజాయి అక్రమ రవాణా నిర్మూలనలో భాగంగా స్థానిక పోలీసులు బుధవారం పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐలు లక్ష్మణరావు, రంజిత్, సందీప్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లను సోదాలు నిర్వహించారు. వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపివేసి ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లను తనిఖీ చేశారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి



రాజు మృతదేహం

కొయ్యూరు: మూల పేట పంచాయతీ మర్రిపాలెం సమీపంలో వడదెబ్బకు గురై రాజు (48)అనే వ్యక్తి బుధవారం మృతిచెందినట్టు కొయ్యూరు సీఐ స్వామినాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనపర్తి ప్రాంతానికి చెందిన వాడుగా చెబుతున్న అతను నర్సీపట్నంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెత్త ఏరుకుని జీవిస్తున్నాడు. దీనిలో భాగంగా మర్రిపాలెం ప్రాంతానికి వచ్చిన రాజు వడదెబ్బకు గురైనట్టు సీఐ తెలిపారు. అతనికి సంబంధించి వివరాలు తెలిస్తే వెంటనే 9440904218 (సీఐ), 9440904241 (ఎస్ఐ), 9440904217 (మంప ఎస్ఐ) నంబర్లకు తెలియజేయాలని ఆయన సూచించారు.

బొర్రాకు ఊరట

బొర్రా పంచాయతీ పరిధిలోని బొర్రా గుహలకు జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్నా అందుకు తగ్గ ఆదాయ వనరులు లేవు. 14 శివారు గ్రామాలున్న ఈ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన ఏడాదికి రూ.2 లక్షలు మాత్రమే నిధులు అందుతున్నాయి. ఇవి కనీసం పారిశుధ్యం నిర్వహణకు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో పర్యాటకశాఖ 20 శాతం వాటాగా విడుదల చేసిన రూ.25 లక్షల నిధులు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సమస్యలు శాశ్వత పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

- బొర్రా గుహల ఆదాయంలో 20 శాతం నిధులు పంచాయతీకి జమ
- తొలివిడతగా రూ.25 లక్షలు జమచేసిన పర్యాటకశాఖ
- శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు
- సీసీ రోడ్లు, మంచినీటి పథకాలకు నిధుల కేటాయింపు



పంచాయతీకి ఆదాయమిస్తున్న బొర్రా గుహలు

అనంతగిరి: అంతంతమాత్రంగా ఆదాయం ఉన్న బొర్రా పంచాయతీకి పర్యాటకశాఖ నిధులు విడుదల చేయడం ఊరట నిచ్చింది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు వచ్చే ఆదాయంలో బొర్రా పంచాయతీకి నిబంధనల ప్రకారం 20 శాతం వాటా ఇవ్వాలి. ఈమేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నవంబర్ రూ.25 లక్షలను విడుదల చేయడంతో ఈమేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ పంచాయతీకి జమ చేశారు. ఏటా విడుదలయ్యే నిధులతో పాటు వీటిని గ్రామాభివృద్ధికి వినియోగించారు. పంచాయతీ పరిధిలో 14 శివారు గ్రామాలు ఉండగా వీటిలో ఆరు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, తాగునీటి పథకాలను నిర్మించారు.

చేపట్టిన అభివృద్ధి పనులు

జీరు గెడ్డలో 150 మీటర్లు, కొయిటిగుడలో 200 మీటర్లు, డెక్కాపురంలో 80 మీటర్లు, కటికిలో 80 మీటర్లు సిమెంటు రోడ్ల నిర్మాణం. నినిమామిడిలో పంప్ హౌస్ నుంచి పైపులైన్ ఏర్పాటు, రూ.5 లక్షలతో తాగునీటి పథకం నిర్మాణం.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

పంచాయతీ పరిధిలోని బొర్రా గుహలకు ఏటా నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో పర్యాటక సీజన్ కావడంతో సందర్శకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. పర్యాటక శాఖ విడుదల చేసిన నిధుల్లో కొంత మొత్తాన్ని బొర్రా జంక్షన్ నుంచి బొర్రా గుహల వరకు నాలుగు నెలలపాటు పారిశుధ్యం నిర్వహణకు పంచాయతీ వెచ్చించింది.

జనాభా ప్రాతిపదికన రూ.2 లక్షలు

బొర్రా పంచాయతీకి జనాభా ప్రాతిపదికన రూ.2లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. కనీసం పారిశుధ్యం తదితర కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా ఈ నిధులు సరిపోవడం లేదు. బొర్రా గుహల నుంచి 20 శాతం వచ్చే ఆదాయం మినహా మిగతా ఎటువంటి వనరులు లేవు.



కొయిటిగుడలో నిర్మించిన సీసీ రోడ్డు



కటిక గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్డు

పంచాయతీ	: బొర్రా
శివారు గ్రామాలు	: 14

ఆదాయం మెరుగుకు..

ఆదాయ వనరులు మెరుగుపరచడంపై పంచాయతీ దృష్టి సారించింది. దీనిలో భాగంగా బొర్రా గుహల వద్ద ఐదు చోట్ల పార్కింగ్ స్థలాలు గతేడాది ఏర్పాటు చేసింది. దీని మూలంగా గత సీజన్‌లో రూ.1.6లక్షల ఆదాయం వచ్చింది.

ఎంతో ఉపయోగం



పంచాయతీకి పర్యాటక శాఖ 20 శాతం కింద విడుదల చేసిన రూ.25 లక్షలు ఎంతో ఉపయోగపడ్డాయి. వీటిలో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. అంతంత మాత్రంగా ఆదాయ వనరులున్నందున పర్యాటక శాఖ నిధుల విడుదలతో ఊరట లభించింది.

– జన్ని అప్పారావు, సర్పంచ్, బొర్రా

పూర్తిస్థాయిలో నిధులిస్తాం



బొర్రా గుహలకు వచ్చిన ఆదాయంలో 20 శాతం వాటా నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ అభివృద్ధికి తమ శాఖ నుంచి రూ.25 లక్షలు విడుదల చేశాం. పూర్తి స్థాయి వివరాలు వచ్చిన వెంటనే మిగతా నిధులు విడుదలకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్ పాణి,
రీజనల్ డైరెక్టర్ పర్యాటకశాఖ, విశాఖపట్నం

మావోయిస్టులది హేయమైన చర్య

ఎస్పీ తుహిన్ సిన్హా

చింతూరు: పొవ్వర్లంకకు చెందిన గిరిజనులు సేకరించిన తునికాకును మావోయిస్టులు దగ్ధం చేయడం హేయమైన చర్యని ఎస్పీ తుహీన్‌సిన్హా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన తునికాకును మావోయిస్టులు దగ్ధం చేయడంతో 42 గిరిజన కుటుంబాల జీవనోపాధి దెబ్బతిందని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టుల దుశ్చర్యను గిరిజన ప్రజలు, నాయకులు వ్యతిరేకిస్తున్నారని, ఇలాంటి చర్యల వల్ల అమాయక గిరిజనులకు నష్టం వాటిల్లుతుందన్నారు. గిరిజనులను అడవుల్లో తిరగకుండా భయాందోళనకు గురిచేయడం, వారి అభివృద్ధిని అడ్డుకునే చర్యలను ఎవరూ సహించరన్నారు. నష్టపోయిన గిరిజనులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, మావోయిస్టులు ఇలాంటి చర్యలను వీడి గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

విభిన్న ప్రతిభావంతులకు పునరావాస కేంద్రం

సాక్షి,పాడేరు: విభిన్న ప్రతిభావంతులకు పలు రకాల సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు పాడేరులో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పర్యవేక్షణ కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛందసంస్థలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వయేతర సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈనెల 17లోగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ పెదవాల్తేరు, విశాఖపట్నం చిరునామాకు దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆనందహేల

- క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం
- జిల్లాలో 400 మందికి మేలు
- తమ జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారని భావోద్వేగం



ఆనందం వ్యక్తంచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం: ప్రజా సంకల్పయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన విన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకొని కాంట్రాక్ట్ ఉద్యోగుల 23 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. వారికి తీపికబురు అందించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సంబరాల్లో మునిగితేలారు. ఇచ్చిన మాటకు కట్టుబడి.. తమ జీవితాల్లో ఆనందం నింపారని భావోద్వేగానికి గురయ్యారు. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెప్పారు.

అలాగే జిల్లా కేంద్రాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచడంతో పాటు సీపీఎస్ స్థానంలో గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్) బిల్లు ముసాయిదాను ఆమోదించారు. ఈ నిర్ణయాలపై కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు కేసు పేరిట టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది

2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చంద్రబాబు దొంగ హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రాగానే ముఖం చాటేశాడు. టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానంలో కేసుల పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేసింది. ఈ విషయాన్ని పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తీసుకెళ్లినా.. ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలుచోట్ల వీరు కలిసి తమ గోడును వినిపించారు. దీనికి స్పందించిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని ఆ హామీని నెరవేర్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే తమకు న్యాయం జరిగిందని ఉమ్మడి విశాఖ జిల్లా కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ల ప్రతినిధులు కొనియాడుతున్నారు. ఎప్పటినుంచో పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం చాలా సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుండగా.. వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 400 మంది ఉన్నారు.

పీఆర్‌సీతో 16 లక్షల మందికి లబ్ధి



ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుకుంటూ వస్తోంది. డీఏ, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేసింది. 23 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల కల నెరవేరింది. కొత్త జిల్లాల్లో హెచ్‌ఆర్ఏ 12 శాతం ఉంది. దీన్ని 16 శాతం పెంచడం సంతోషంగా ఉంది. సీపీఎస్ రద్దు చేశారు. 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పీఆర్‌సీ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.

– కె.ఈశ్వరరావు,
ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్

క్రమబద్ధీకరణతో మేలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఆర్టీలను క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టడం, రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించడం సంతోషంగా ఉంది. పాడేరు ఐటీడీఏ పరిధిలో 70మంది సీఆర్‌టీలకు మేలు జరుగుతుంది.

– టి.నూకరాజు,
జిల్లా ప్రతినిధి, సీఆర్టీల సంఘం

ఉద్యోగ భద్రత శుభపరిణామం



సీఆర్టీల క్రమబద్ధీకరణతో సీఆర్టీల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. గతేడాది వేతనాలు పెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారు. ఇప్పుడు సీనియారిటీ ప్రకారం ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించడం శుభపరిణామం.

– కె.వెంగలబాబు, సీఆర్టీ, పాడేరు

దృశ్యం మధురం



మారేడుమిల్లి: ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు తూర్పు ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడ చుట్టూ ఎత్తయిన కొండలు, చల్లని వాతావరణం, గలగల పారే సెలయేళ్లు.. వంపుసొంపుల రహదారులు.. ఇలా ఎన్నో అందమైన దృశ్యాలు మన్యం సొంతం. ఇక్కడి అందాలను తిలకించేందుకు ఏటా దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వేలాదిగా తరలి వస్తుంటారు. అటువంటి ప్రకృతి అందాలతో పాటు తేనెపట్టులు ఆకట్టుకుంటున్నాయి. మారేడుమిల్లి– చింతూరు రహదారిలోని స్థానిక కాఫీ తోటలు వద్ద చెట్లు తేనెటీగలు ఆవాసంగా మార్చుకున్నాయి.

రాజవొమ్మంగిలో జేవీకే డిస్ట్రిబ్యూషన్ పాయింట్



కంటైనర్లలో చేరిన స్కూల్ యూనిఫాం కిట్లు

రాజవొమ్మంగి : జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు అందజేసే యూనిఫాంలను ప్రతీ మండలానికి చేరవేసేలా రాజవొమ్మంగిలో ఓ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు డీఈవో సలీంబాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో మొత్తం 52,681 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరి కోసం ప్రభుత్వం నుంచి మూడు జతల చొప్పున యూనిఫాంలు వచ్చాయన్నారు. ఇప్పటికే తయారు అయిన యూనిఫాంలు కంటైనర్లలో రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలకు చేరుకున్నాయన్నారు. ఇక్కడ నుంచి చింతూరు, రంపచోడవరం డివిజన్లలోని పాఠశాలలకు వాహనాల్లో తరలిస్తామని ఆయన పేర్కొన్నారు. రవాణా, పంపిణీ ప్రక్రియ సులభతరం చేసేందుకు రాజవొమ్మంగిలో తాత్కాలికంగా ఒక డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.

నిధుల దుర్వినియోగం ఉపేక్షించను

కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఉపేక్షించనని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి 22 మండలాల ఉపాధి హామీ అధికారులు,ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఏటా రూ.250 కోట్ల విలువైన ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ పనుల్లో నకిలీ మస్తర్లు వేసే సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. నకిలీ, తప్పుడు మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ మండలంలో మూడు చెరువులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అమృత్ సరోవర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఏజెన్సీలో గంజాయి సాగు నిర్మూలించిన రైతుల భూముల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని చేపడతామన్నారు.ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని అన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ డివిజన్‌లో తొమ్మిది మండలాల్లో గంజాయి సాగు జరుగుతోందన్నారు. పంచాయతీల వారీగా గంజాయి సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరించాలని పోలీసులు, ఎంపీడీవోల సమన్వయంతో పని చేయాలన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ఉద్యానవన మొక్కలను పంపిణీ చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ ధీరజ్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్‌కుమార్ రావు, డీవోపీవో పీఎస్ కుమార్, గృహ నిర్మాణశాఖ ఈఈ బాబు, సీసీవో ఎస్ఎస్ఆర్‌కే పట్నాయక్, ఉపాధి హామీ ఏపీడీ జి.గిరిబాబు పాల్గొన్నారు.

గిరిజనులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

జనన ధ్రువీకరణ పత్రాల జారీకి నోటరీలు చేయాలని, గిరిజనులను ఇబ్బందులు పెడితే రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, సర్వే అధికారులు, వీఆర్వోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భూముల సర్వే, పీవీటీజీల ఓటర్ల నమోదు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . వీఆర్వోలు, సర్వేయర్లు డేటా ఎంట్రీని పూర్తి చేసి, గ్రామసభలు ఏర్పాటు చేసి గిరిజనుల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. వీఆర్వోలు గ్రామసచివాలయాలకు హాజరుకాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు వీఆర్వోలు సచివాలయాలకు హాజరుకాని పక్షంలో డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయవద్దని తహసీల్దార్లను ఆదేశించారు. కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగే పరిస్థితి ఉండకూడదని కలెక్టర్ సూచించారు. జేసీ శివశ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, సర్వే ఏడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల కుటుంబాలను ఆదుకుంటాం



లంకవీధిలో గంటందొర విగ్రహాన్ని ఆవిష్కరించిన అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితరులు



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ,ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో

- గాం గంటందొర, మల్లుదొర కుటుంబాలకు ఇళ్లు
- అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- లంకవీధిలో శతాధిక వర్ధంతి
- గంటందొర విగ్రహావిష్కరణ

కొయ్యూరు: స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. బుధవారం ఆమె పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తో కలిసి లంకవీధిలో గాం గంటందొర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా అల్లూరి అనుచరులుగా ముద్రపడిన గాం గంటందొర, మల్లుదొర కుటుంబాలను ఎవరు పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం గంటందొర శతాధిక వర్ధంతిని నిర్వహించి కుటుంబ సభ్యులకు ఇళ్ల నిర్మిస్తోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు. గంటందొర, మల్లుదొర కుటుంబీకులు ఎవరైనా చదువుకుని ఉంటే జాబ్‌మేళా నిర్వహించినప్పుడు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని రంగాల్లోను ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కొందరు విమర్శలు చేయడం పనిగా పెట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇక్కడ సమరయోధుల కుటుంబాలకు చెందిన 12 మందికి గృహాలు నిర్మిస్తున్నామన్నారు. వీటి బాధ్యతను నాగార్జున నిర్మాణసంస్థ(ఎన్‌సీసీ) చేపడుతుందన్నారు. ఆ సంస్థల ప్రధాన కార్యదర్శి నానిరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది వారంతా ఇదే రోజుకు సొంత ఇళ్లలో ఉంటారని, ఇదే సందర్భంగా గృహప్రవేశాలు చేస్తారన్నారు. దీనికి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పీవో కూడా రావాలని ఆయన కోరారు. గిరిజన పరిశోధన సాంస్కృతిక శిక్షణ సంస్థకు చెందిన ప్రొఫెసర్ శంకర్రావు మాట్లాడుతూ గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన మ్యాప్‌ను తయారు చేస్తున్నామన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్‌కు పలువురు వినతులు అందజేశారు. దీనిలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, గాడి సత్యనారాయణ, స్వచ్ఛభారత్ డైరెక్టర్ మీరా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు జి.మహేష్, పర్సన్‌ఇంచార్జ్ ఎస్.సూరిబాబు, టీడబ్ల్యూ ఈఈ రాజు, డీఈ చాణక్య, ఏటీడబ్ల్యూవో క్రాంతి, జేఈలు రామకృష్ణ, విశ్వతేజ, తహసీల్దారు తిరుమలరావు, ఎంపీడీవో మేరీరోజ్, ఎంపీటీసీలు మల్లేశ్వరి, బి.అప్పారావు, లోకుల సోమాగాంధీ, ఎంఈవో బోడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు నేడు కౌన్సెలింగ్

రంపచోడవరం: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పీవో గురుకులం ఉత్తర్వుల ప్రకారం రంపచోడవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, కూనవరం ప్రాంతాలకు చెందిన బాలికలకు రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు 10వ తరగతి మార్క్స్ జాబితా, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు మూడు సెట్లు జెరాక్స్ తీసుకురావాలన్నారు. బాలురల ప్రవేశానికి కౌన్సిలింగ్ తేదీలు రెండు రోజుల్లో ప్రకటిస్తామని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ శ్రీమతి జి. ప్రశూన తెలిపారు.

పసుపు కొనుగోలుకు చర్యలు

చింతపల్లిరూరల్: గిరిజన రైతులు పండించిన పసుపును కోనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నమని హార్టీకల్చర్ అధికారి కంఠ బాలకర్ణ తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పసుపు కోనుగోలుకు సంభందించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. చింతపల్లి, గూడెం కొత్త వీధి, జి.మాడుగులు మండలాల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఎండలు.. మంటలు

వేసవి చివరి దశకు చేరుకుంది. అయినా ఎండలు మండుతున్నాయి. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సాధారణ రోజుల కంటే వేసవిలోనే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉంటుంది. వీటిని అప్రమత్తతతో నివారించవచ్చని అధికారులు చెప్తున్నారు.


రాంబిల్లిలో దగ్ధమవుతున్న తుక్కు కేంద్రం(ఫైల్)


మర్రిపాలెంలో అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న యోగా కేంద్రం(ఫైల్)

- మరో వారం రోజులు అధిక ఉష్ణోగ్రతలు
- అగ్నిప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు
- ఈ వేసవిలో రూ.1.27 కోట్ల మేర ఆస్తి దగ్ధం

తుమ్మపాల : ఈ ఏడాది వేసవి మొదలు, రోజురోజుకు ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ప్రతి రోజు 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు వడగాడ్పులు తోడవడంతో పలు చోట్ల అగ్ని ప్రమాదాలు నెలకొంటున్నాయి. పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, వ్యాపార కూడళ్ల, పంటలు, కమ్మల పాకలతో పాటు, ఇళ్లలోనూ తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఈ వేసవిలో రూ.1.27 కోట్ల ఆస్తి నష్టం

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో 90కి పైగా అగ్నిప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.1.27 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని, మంటల్ని ఆర్పి, రూ.4.72 కోట్ల మేర ఆస్తుల్ని సంరక్షించారు. జిల్లాలో రెండు చోట్ల రూ.10 లక్షలపైన ఆస్తినష్టం వాటిల్లిన ప్రమాదాలు సంభవించాయి. హైరిస్క్ కేటగిరీ ప్రమాదాల్లో ఏడింటిని సిబ్బంది చాకచక్యంగా నివారించగలిగారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య విలువున్న ఆస్తిని ఒక ప్రమాదంలోను, 83 సాధారణ ప్రమాదాలను అగ్నిమాపక సిబ్బంది నియంత్రించారు.

ముందు జాగ్రత్త తప్పనిసరి

ఇప్పుడు ప్రతి పనికి విద్యుత్ వినియోగం తప్పనిసరి. ఇళ్లల్లో వంటల నుంచి వ్యవసాయం, వ్యాపారం, పారిశ్రామిక వాడల్లో ఉత్పత్తుల వరకు అన్నింటికీ విద్యుతే ప్రధాన ఆధారం. దీంతో వేసవి ఎండల దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఒకే ప్లగ్ పాయింట్ నుంచి ఎక్కువ గృహోపకరణాలకు విద్యుత్ సరఫరా చేయకుండా చూసుకోవాలి. మరమ్మతుకు గురైన విద్యుత్ పరికరాలను సొంతంగా రిపేర్లు చేయకుండా, నిపుణుల్ని ఆశ్రయించడం మేలు. గ్రైండర్లు, ఏసీ, ఫ్రిడ్జ్ వంటి పరికరాల్లో అసాధారణ శబ్దాలు వస్తే అశ్రద్ధ చేయకుండా మెకానిక్ వద్దకు తీసుకెళ్లాలి.

రైతులకు ప్రత్యేక సూచనలు

- పంట పొలాల్లో ఎండా కాలంలో ఎలాంటి మంటలు వేయొద్దు. ఒక వేళ పొలాల్లో చెత్తను తొలగించేందుకు మంట వేయాలనుకుంటే తెల్లవారు జామునే వేయాలి. పూర్తిగా దగ్ధమయ్యేంత వరకు దగ్గరే ఉండి, నీళ్ల చల్లి మంటల్ని ఆర్పివేయాలి.
- వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించిన మోటారు స్టార్టర్లు, స్విచ్‌లున్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి.
- కాటన్ మిల్లుల్లో ప్యానల్ బోర్డులు, మోటార్లలోనికి కాటన్ డస్ట్ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లూజ్ కనెక్షన్లు, వైరింగ్ సమస్యల్ని ముందుగానే పరిష్కరించాలి.
- అన్ని స్విచ్ బోర్డులు, ప్యానెల్ బోర్డులు ముందు రబ్బరు మాట్లు విధిగా ఏర్పాటుచేయాలి. చెక్క మీద స్విచ్ బోర్డులుంటే ఇండస్ట్రియల్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటుచేయాలి.
- వాహనాల్లో ప్రయణించే సమయాల్లో ట్రాక్టర్‌కు ఎండు గడ్డి చుట్టుకోకుండా చూసుకోవాలి. అలా చుట్టుకుంటే ట్రాక్టర్ వేడికి గడ్డి నుంచి మంట లొచ్చే ప్రమాదం ఉంది.
- రేడియేటర్లో తగినంత నీరు ఉన్నదీ, లేనిదీ తరచూ పరిశీలించాలి.
- వాహనాలపై ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు జారిపడినా, వాటికి వాహనం తగిలినా, వాహనంలో నుంచి బయటకు పడేందుకు హోపింగ్(గెంతుట, దూకట) విధానాన్ని అనుసరించాలి.

నిమిషాల్లో స్పందన



ఫైర్ నెంబర్ 101కు కాల్ చేస్తే చాలు, నిముషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకుంటున్నాం. మా సిబ్బంది నిమిషానికి రెండు కిలోమీటర్ల వేగంతో చేరుకుని ప్రమాదాన్ని నివారిస్తారు. జూన్ 14 వరకు 46 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరికలున్నాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయట తిరగొద్దు. ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాలి.
– ఆర్.వెంకటరమణ, జిల్లా అధికారి, విపత్తు, అగ్నిమాపక శాఖ

సీహెచ్‌సీకి జనరేటర్లు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీకి పూర్తిస్థాయిలో జనరేటర్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఆమె మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం పాత జనరేటర్ పాడవ్వడంతో ప్రభుత్వానికి నివేదించామన్నారు. దీంతో ఇన్వెర్టర్ ఏర్పాటుచేశారన్నారు. మూడు నెలలక్రితం చిన్న పిల్లల వార్డుకు ప్రత్యేక జనరేటరును ప్రభుత్వం ఏర్పాటు సమకూర్చిందన్నారు. అన్ని వార్డులకు ఉపయోగపడే 63 కేవీ జనరేటరును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు బుధవారం ప్రారంభించినట్టు ఆమె పేర్కొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం

- జిల్లా హౌసింగ్ పీడీ బాబు

అరకులోయ రూరల్: గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ బి.బాబు సూచించారు. మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీలో బుధవారం ఆయన పర్యటించారు. పద్మాపురం, ప్రధానిపుట్టు, యండపల్లివలస గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజురు చేసిన హౌసింగ్ గృహల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. అరకులోయ డివిజన్‌లో 4,184 గృహాలు మంజురు కాగా 3,755 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన 429 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. హౌసింగ్ ఏఈ కృష్ణారావు, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఎస్. క్రాంతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతో అభివృద్ధి

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ బూరుగువీధి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జన్ భగి ధరి (ఎఫ్ఎల్ఎన్) ప్రదర్శన కార్యక్రమంలో ఎంఈవో ఎం.కృష్ణమూర్తి అధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి జరిగింది. సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో కె.భాస్కరరావు, సీఎంవో ఎం.జ్ఞానప్రకాష్‌లు విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. అక్షరాస్యత పెంపునకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. విద్య దశలో పునాది, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాలను పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని, పాఠశాలల్లో జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు అమలుచేయనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు బోధన, పేపర్ క్రాఫ్ట్, , నిపున్ భారత్ ప్రజ్ఞ, క్విజ్, పద్యాలు, రంగోలి, కోలాటం, నృత్యాలు, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఆర్‌పీలు వీరభద్రమ్మ, సన్యాసిదొర తదితరలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో భాస్కరరావు, సీఎంవో జ్ఞానప్రకాష్

చిరుధాన్యాల సాగు విస్తరణ

- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- ఏపీసీఎన్ఎఫ్ రాష్ట్ర రిసోర్సు పర్సన్ దేముళ్లు

చింతపల్లి: జిల్లాలో చిరుధాన్యాల సాగును విస్తర్ణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీసీఎన్ఎఫ్ రాష్ట్ర రిసోర్సు పర్సన్ దేముళ్లు అన్నారు. బుధవారం ఆయన చింతపల్లి మండలంలో పర్యటించారు. అంతర్ల రైతు భరోసా కేంద్రం వద్ద రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ ప్రోగ్రాం సమన్వయకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులతో ఆయన మాట్లాడారు. ఈఏడాది జిల్లాలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో సుమారు ఆరువేల ఎకరాల్లో రాగులు, కొర్రలు, సామలు తదితర చిరుధాన్యాలను సాగు చేయాలని నిర్ణయించామన్నారు. ఇందు కోసం సుమారు 12వేల మంది గిరిజన రైతులను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. గులి, జమున విధానంలో చిరుధాన్యాల సాగు వల్ల రైతులకు రెట్టింపు దిగబడులు వస్తున్నాయన్నారు. అందుచేత ఈ విధానాలనే రైతులు ఆచరించేలా వారిని ప్రోత్సహిస్తున్నట్టు ఆయన తెలిపారు. చిరుధాన్యాల సాగుకు సంబంధించిన విత్తనాలను తామే సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. అంతరించిపోతున్న మెట్టధాన్యం విస్తరణకు ఈ ఏడాది చర్యలు చేపడుతున్నట్టు దేముళ్ల తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది కుమార్, రామచంద్రరావు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

ముంచంగిపుట్టు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశ మందిరంలో రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలతో ఐసీడీఎస్ సీడీపీవో వరహాలమ్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ నెలసరి విషయంలో కిశోర బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే వైద్య సిబ్బంది సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టిక విలువల ఆహారం సక్రమంగా అందించాలని, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలపై తరుచూ అవగాహన కల్పిస్తూ ఆహారం అందించాలన్నారు. మండలంలో నాడు–నేడు ద్వారా జరుగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ఎంపీడీవో రమేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, వరహాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

గొడౌన్ల నిర్మాణానికి స్థల పరిశీలన

రాజవొమ్మంగి: మండలంలో సివిల్ సప్లయ్స్ సరకులు భద్రపరిచేందుకు నూతనంగా నిర్మించనున్న భారీ బఫర్ గోడౌన్‌ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను జేసీ శివశ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ గణేశ్ కుమార్, జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ (డీఎస్ఓ) శ్యాంకుమార్‌లు బుధవారం పరిశీలించారు. మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ సమీపంలో, సింగంపల్లి రోప్‌వే వద్ద గల స్థలాలను చూశారు. అనంతరం జేసీ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 17వేల టన్నుల సరకులు నిల్వ చేసేందుకు గోడౌన్లు అవసరమన్నారు. ఇప్పటి వరకు సరకుల పంపిణీ కోసం ఇతర జిల్లాలలోని గోడౌన్లపై ఆధారపడుతున్నామన్నారు. సమస్య పరిష్కరించేందుకు జిల్లాకు మూడు వేల నుంచి ఐదు వేల టన్నుల సామర్థ్యం గల బఫర్ గొడౌన్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కాగా ప్రస్తుతం మారేడుమిల్లి సమీపంలోని దేవరాపల్లిలో 3000 టన్నుల సామర్థ్యంతో ఒకటి, అరకు వద్ద అమలగూడ వద్ద మరో 3వేల టన్నుల సామర్థ్యం గల బఫర్ గొడౌన్ మంజూరైనట్టు చెప్పారు. బఫర్ గోడౌన్ నిర్మించేందుకు రాజవొమ్మంగిలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని, నివేదకను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సివిల్‌సప్లయ్స్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ వెంకటకృష్ణ, తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి తదితర అధికారులు ఉన్నారు.


సింగంపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాస్, ఇతర అధికారులు

అనకాపల్లికి ఆరో స్థానం

- వైఎస్సార్ కంటి వెలుగు సేవలకు గుర్తింపు
- అవ్వా తాతల కళ్లల్లో వెలుగులు

నక్కపల్లి: వైఎస్సార్ కంటి వెలుగు పథకం అమలులో అనకాపల్లి జిల్లాకు రాష్ట్రంలో ఆరో స్థానం లభించింది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక మసకబారిన చూపుతో కాలం వెళ్లదీస్తున్న అవ్వాతాతలకు, సరైన పోషకాహారం లేక, చిన్నతనంలోనే దృష్టిలోపాలతో బాధపడుతున్న చిన్నారులకు వైఎస్సార్ కంటి వెలుగు ఒక వరంగా నిలిచింది. ఈ పథకం ద్వారా పాఠశాలలకు నేరుగా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు వచ్చి దృష్టి లోపాలతో బాధపడేవారిని గుర్తించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. కళ్లద్దాలు పంపిణీ చేసి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా లక్షలాది మంది అవ్వాతాతలు, పాఠశాల విద్యార్థుల కళ్లల్లో కొత్త వెలుగులు విరబూస్తున్నాయి. 2019 అక్టోబరు 10న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటి, రెండు విడతల్లో పాఠశాల విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. మూడో విడతలో వృద్ధులపై దృష్టి పెట్టారు. జిల్లాలో జూన్ 5వ తేదీ వరకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అందించిన సేవలకు గాను ఆరో స్థానం లభించినట్టు అధికారులు తెలిపారు.

నిరంతరం వైద్యపరీక్షలు

ప్రతిరోజు మండల కేంద్రాల్లో ఉన్న సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే పీహెచ్‌సీల్లో పనిచేసే ఆప్తాలమిక్ అసిస్టెంట్లు గ్రామాల్లోకి వెళ్లి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి దృష్టి లోపంతో ఉన్న వారిని గుర్తిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.


అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

సేవలకు గుర్తింపు



వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో అందిస్తున్న సేవలకు గాను అనకాపల్లి జిల్లాకు రాష్ట్రంలో ఆరో స్థానం లభించింది. ప్రతి గ్రామంలో ముమ్మరంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం నడుస్తున్న ఫేజ్ 3లో ఇంతవరకు 71శాతం మందికి కంటి పరీక్షలు, 82 శాతం మందికి కళ్లద్దాలు, 61 శాతం మందికి శస్త్రచికిత్సలు పూర్తి చేశాం.
–డాక్టర్ రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (వైఎస్సార్ కంటి వెలుగు పథకం)

ఫేజ్ 3లో అవ్వా తాతలకు....

2020 ఫిబ్రవరి 18న ప్రారంభమైన ఫేజ్ 3లో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు 'కంటి వెలుగు'

	అర్హులు	సేవలు అందుకున్నవారు
వైద్య పరీక్షలు	2,19,993	1,54,572
కళ్లద్దాలు	49,222	40,388
శస్త్రచికిత్సలు	8665	5275

కోతుల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: కోతులు దాడి చేయడంతో బుధవారం ఓ ఎనిమిదేళ్ల బాలుడి తలకు తీవ్ర గాయమైంది. గ్రామానికి చెందిన వాడపర్తి లిఖిత్ కుమార్ తన ఇంటి వద్ద ఆడుకుంటుండుగా, అటువైపుగా వచ్చిన కోతులను ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో బాలుడు కింద పడిపోయాడు, తలకు గాయామైంది. స్థానిక పీహెచ్‌సీకి తరలించగా, మెరుగైన చికిత్స కోసం వైద్యులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మారేడుమిల్లిలో కోతుల బెడద అధికమైయిందని, పాదచారులపై, కోతులు గుంపులుగా దాడి చేస్తున్నాయని, ఇళ్లల్లో చొరబడి వస్తువులు తీసుకుపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కోతులను తీసుకువచ్చి ఇక్కడ వదిలేయడంతో రోజు, రోజుకు వాటి బెడద ఎక్కువవుతుందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


గాయపడిన బాలుడు లిఖిత్ కుమార్

చదువుపై అయిష్టతతో విద్యార్థి ఆత్మహత్య

యలమంచిలి: చదవుపై అయిష్టతతో ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం యలమంచిలి మండలం రుక్మిణీపురం గ్రామానికి చెందిన సత్తిబాబు విజయవాడ రైల్వేస్టేషన్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసముంటున్నాడు. కుమారుడు కాళ్ల దుర్గారావు (19)ను ఇటీవల విజయవాడలోని ఓ కాలేజీలో డిగ్రీలో చేర్పించారు. డిగ్రీ చదవడం దుర్గారావుకు ఇష్టం లేకపోవడంతో తల్లిదండ్రులతో ఘర్షణ పడి మంగళవారం యలమంచిలి మండలం రుక్మిణీపురంలో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన దుర్గారావు అమ్మమ్మ తాతయ్య చూసి కొనఊపిరితో ఉన్న అతనిని అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్టు తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

స్కూటీ దగ్ధం

యలమంచిలి: మరమ్మతుల కోసం వెల్డింగ్ చేస్తున్న సమయంలో మంటలు వ్యాపించి ఓ స్కూటీ దగ్ధమైంది.అగ్నిమాపకశాఖాధికారి డి.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక పాత జాతీయ రహదారిలో గల వెల్డింగ్ షాపులో బుధవారం సాయంత్రం స్కూటీకి వెల్డింగ్ చేస్తుండగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈప్రమాదంలో రూ.లక్ష విలువచేసే స్కూటీ దగ్ధమైనట్టు వారు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


మంటల్లో దగ్ధమవుతున్న స్కూటీ